4 | నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 15 సెప్టెంబర్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మంచానపడ్డ మన తెలంగాణ

విస్తారమైన వర్షాలు కురవడంతో రాష్ట్రంలో మొన్నటిదాకా వరదలు పోటెత్తాయి. దాంతో పారిశుద్ధ్యం పేరుకుపోయింది. తత్ఫలితంగా విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ఇప్పుడు రాష్ట్ర ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ వ్యవస్థలు విఫలమవ్వడమే అందుకు ప్రధాన కారణం. యావత్ తెలంగాణ ఇప్పుడు మంచానపడ్డది. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోతుండటంతో ప్రజలు కార్పొరేట్ దవాఖానలకు క్యూ కడుతున్నారు. లక్షల్లో ఖర్చుపెడుతున్నారు. అయినప్పటికీ కొందరు ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరం.



డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్
88866 66006

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. కాగా, పాలకులు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడంపైనే దృష్టిసారిస్తున్నారు. వారు పట్టించుకోకపోవడంతో అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు కుంటుపడ్డాయి. ఫలితంగా రాష్ట్రంలో పాలన పడకేసింది.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండేది. కుటుంబం బాగుంటేనే సమాజం బాగుంటుందని నమ్మే కేసీఆర్ తన పాలనలో ప్రజారోగ్యం, మాతాశిశు, మహిళల సంక్షేమానికి పెట్టపీట వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ఠపరిచారు. జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటుచేశారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండేలా చేశారు. అంతకంటే ముందే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బందికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరణ, మురుగుకాల్వల నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడారు. కానీ, గత 9 నెలలుగా పరిస్థితి తారుమారైంది. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో అధికారులే రాజ్యమేలుతున్నారు. రేవంత్ సర్కార్ ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యత అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ప్రజలు రోగాల బారినపడుతున్నారు.

**కౌన్సిలర్లను ప్రలోభపెట్టి, దొడ్డిదారిన మున్సిపాలిటీలను చేజిక్కించుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజా సంక్షేమంపై దృష్టిపెట్టడం లేదు. అడ్డదారిలో అందలమెక్కుతూ అధికారాన్ని కైవసం చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు అక్రమ సంపాదన కోసం అర్రులు చాస్తున్నారే తప్ప ప్రజల బాగోగులను పట్టించుకోవడం లేదు.**



రాష్ట్రంలో నమోదవుతున్న డెంగ్యూ కేసులు దడ పుట్టిస్తున్నాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు 6,848 మందికి డెంగ్యూ సోకినట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. వీటిలో హైదరాబాద్‌లో నమోదైనవే 2,697 కావడం గమనార్హం. మేడ్చల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో మిగతా కేసులు నమోదైనట్టు ప్రభుత్వం వెల్లడించింది. కానీ, అనధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా 32 వేలకు పైగా డెంగ్యూ కేసులు నమోదైనట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో కేసుల నమోదు, మరణాల రేటును ప్రభుత్వం దాచిపెడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూలై నుంచి ఇప్పటివరకు 1.42 కోట్ల మందికి పైగా జ్వర సర్వే చేసి అతి తక్కువ డెంగ్యూ కేసులు నమోదైనట్టు వైద్యారోగ్య శాఖ ప్రకటించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

విషజ్వరాల బాధితులతో హైదరాబాద్‌లోని నీలోఫర్, గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. సరైన వైద్యం అందక రెండు, మూడు రోజుల్లోనే ఆరోగ్యం విషమించి మరణాలు సంభవిస్తున్నాయి. అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గర్హనీయం. ప్రభుత్వ దవాఖానల్లో సరైన వసతులు, మందులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడికి గురవుతున్నారు.

**ఇదిలా ఉంటే.. గురుకులాల్లో పరిస్థితులు మరింత దయనీయమయ్యాయి. అటు ఆహార కలుషితం.. ఇటు విషసర్పాల కాట్లతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుండటం తల్లిదండ్రులను కలవరపెడుతున్నది. కేసీఆర్ హయాంలో పూర్ణ, ఆనంద్ లాంటి విద్యార్థులు హిమాలయాలను అధిరోహించారు. కానీ, రేవంత్ హయాంలో ఫుడ్ పాయిజన్, సౌకర్యాల లేమి, పాముకాట్లతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్నారు.**

అక్రమార్కులతో కుమ్మక్కవుతున్న ప్రిన్సిపల్స్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తున్నది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముక్కు పచ్చలారని చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నారు. వేలాది మంది పిల్లలు గాయాల పాలవుతున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదు. ఈ విషయమై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**ఇక రాష్ట్రంలోని పెద్ద పెద్ద హోటళ్లలో కలుషిత ఆహారం పట్టుబడటం సర్వసాధారణమైంది. పాడైపోయిన, గడువు ముగిసిన పదార్థాలను వినియోగదారులకు విక్రయిస్తుండటం బాధాకరం. ఇవి హైదరాబాద్‌లో వెలుగుచూసిన దారుణాలు మాత్రమే. కరీంనగర్, వరంగల్ లాంటి ద్వితీయశ్రేణి నగరాల్లో తదితర ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత తీవ్రంగా ఉన్నది. దాంతో అక్కడ జరిగే దారుణాలు అంతగా వెలుగులోకి రావడం లేదు.**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వాళ్ల నిర్లక్షపూరిత ధోరణితోనే రాష్ట్రంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయి. ప్రజలు సమిధలవుతున్నారు. కాబట్టి ఇకనైనా రేవంత్ సర్కార్ మొద్దునిద్రను వీడాలి. ప్రభుత్వం తన తీరును మార్చుకొని సంక్షేమంపై దృష్టిసారించకపోతే ప్రజల తిరుగుబాటు ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పకుండా వస్తుం ది. ఇందులో ఏ మాత్రం సంశయం అక్కరలేదు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముక్కు పచ్చలారని చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నారు. వేలాది మంది పిల్లలు గాయాల పాలవుతున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదు. ఈ విషయమై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

---

నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్.. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఆద్యుడు, ఇంజినీరింగ్ లోకానికి పూజ్యుడు. యావత్ భారతదేశం గర్వించదగిన ఇంజినీర్ దిగ్గజాల్లో ఆయన కూడా ఒకరు. సర్ ఆర్థర్ కాటన్, కేఎల్ రావు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి దిగ్గజాల సరసన నిలిచిన గొప్ప ఇంజినీర్ మన తెలంగాణలో పుట్టడం మనకు గర్వకారణం.

# ప్రాజెక్టులకు ఆద్యుడు అలీ జంగ్



తాళ్లపల్లి యాదగిరిగౌడ్
99497 89939



నేడు ఇంజినీర్స్ డే

సాగునీటి రంగ పితామహుడిగా పేరుగాంచిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ మధ్యతరగతి కుటుంబానికి చెందిన మీర్ వాయిజ్ అలీ దంపతులకు 1877, జూలై 11న హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మీర్ మహ్మద్ అలీ. అయితే, వివిధ ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభను మెచ్చుకున్న నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ అతనికి అలీ నవాజ్‌జంగ్ బిరుదుతో సత్కరించారు. అప్పటినుంచి ఆయన పేరు అలీ నవాజ్ జంగ్‌గా స్థిరపడిపోయింది.

అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో అలీ నవాజ్ జంగ్ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. అనంతరం నిజాం కాలేజీలో ఉన్నత విద్యనభ్యసించారు. 1896లో ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత కూపర్ హిల్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ పట్టా పొందారు. 1899లో చదువు పూర్తిచేసుకున్న ఆయన హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. అదే ఏడాది పీడబ్ల్యూడీ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆయన అనతికాలంలోనే దేశం గర్వించదగిన ఇంజినీర్లలో ఒకరిగా ఎదిగారు. 30 ఏండ్ల తన ఉద్యోగ ప్రస్థానంలో హైదరాబాద్, గుల్బర్గా, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్ తదితర ప్రాంతాల్లో పనిచేశారు. తెలంగాణ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆయన ఎంతగానో కృషిచేశారు.

**ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, పోచారం, నిజాంసాగర్, వైరా, పాలేరు, కడెం లాంటి అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అంతేకాదు, మూసీ, చంద్రసాగర్, రాజోలిబండ, పోచంపాడ్, నందికొండ, సరళా సాగర్, భీమా, దేవనూర్, పెన్‌గంగా, ఇచ్చంపల్లి, లోయర్ మానేర్, పూర్ణా (మహారాష్ట్ర) లాంటి అనేక ప్రాజెక్టులను ప్రతిపాదించారు.**

నవాజ్ అలీ జంగ్ బహదూర్ హైదరాబాద్ నగర రూపశిల్పిగా పేరొందారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహా మేరకు నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి పాటుపడ్డారు. తద్వారా ఆ కాలంలోనే అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ కలిగిన నగరంగా హైదరాబాద్‌కు ప్రపంచఖ్యాతి తీసుకొచ్చారు. తన అమోఘమైన ప్రతిభకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన అలీ నవాజ్ జంగ్ అనేక సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వంతెనలు, భవనాలను నిర్మించారు. హైదరాబాద్ నగరానికి దుఃఖదాయినిగా మారిన మూసీ వరదలను నియంత్రించి, ఎంతోమంది ప్రాణాలను, కోట్ల రూపాయల ఆస్తులను కాపాడిన మహనీయుడు అలీ నవాజ్ జంగ్.

1908లో వచ్చిన మూసీ వరదలు హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తాయి. ఆ వరదల్లో చాలామంది మరణించారు. దీంతో అప్పటి నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ భవిష్యత్తులో వరదలు రాకుండా నియంత్రించే బాధ్యతను ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు అప్పగించారు. ఆయన తన సహాయకుడిగా అలీ నవాజ్ జంగ్‌ను నియమించుకున్నారు. వారిద్దరూ తమ ప్రతిభతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను నిర్మించారు. నాడు వరద నియంత్రణ కోసం నిర్మించిన జంట జలాశయాలే ఇప్పటికీ హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందిస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రణాళికా సంఘం సభ్యుడిగా కూడా సేవలందించిన అలీని ఉమ్మడి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. అయితే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక తెలంగాణలో ఇంజినీర్స్ డే రోజున మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో పాటు అలీని స్మరించుకుంటున్నాం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతం కోసం అహర్నిశలు శ్రమించిన ఆయన సేవలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపైనే ఉన్నది.






# విలీనం ఎవరి కోసం?

ప్రజాపాలన అంటే ప్రజల కోసం, ప్రజల చేత నిర్వహించబడే పరిపాలనా వ్యవస్థ. ప్రజా సమస్యలపై చర్చించడం, అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, సబ్బండవర్గాల అభిప్రాయాలు తీసుకోవడం ప్రజా పాలనలో చాలా అవసరం. కానీ, ఒకే ఒక్క ఆర్డినెన్స్‌తో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసింది.



లట్టుపల్లి విక్రమ్
97015 87979

ఒకే ఒక్క కలంపోటుతో పెద్ద అంబర్‌పేట, కుత్బుల్లాపూర్, నాగారం, తూంకుంట, తుక్కుగూడ, నార్సింగి, శంషాబాద్, మేడ్చల్, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, అమీన్‌పూర్, తెల్లాపూర్ తదితర మున్సిపాలిటీలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం కానున్నాయి. తద్వారా గ్రేటర్ పరిధి 2,053.44 చదరపు కిలోమీటర్లకు విస్తరించనున్నది. ఫలితంగా పరిపాలన మరింత జఠిలం కానున్నది. పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజలకు సేవలు దగ్గరవుతాయి. అందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి పది జిల్లాలను విభజించి 33 జిల్లాలుగా ఏర్పాటుచేశారు. అనేక మండలాలను సృష్టించి పాలనను ప్రజలకు చేరువ చేశారు. అందుకు అనుగుణంగా కలెక్టరేట్లు, దవాఖానలు వంటి భవనాలు నిర్మించి ప్రభుత్వ యంత్రాంగాన్ని దగ్గర చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌తో గ్రేటర్ పరిధి పెరగడం వల్ల ప్రతి చిన్న పనికి ప్రజలు బల్దియా గడప తొక్కాల్సి ఉంటుంది. దీనివల్ల రోజులు, నెలల తరబడి సమస్య తీరకపోయే ప్రమాదమూ ఉన్నది.

దేశంలో ఏ మహానగరాల పరిధి కూడా ఇంతగా విస్తరించలేదు. దేశ రాజధాని ఢిల్లీ పరిధి 1,483 చదరపు కిలోమీటర్లు. ఆర్థిక రాజధాని నగరమైన ముంబై పరిధి 526 చదరపు కిలోమీటర్లు. చెన్నైది 426 చదరపు కిలోమీటర్లు. ప్రఖ్యాత టోక్యో నగరంలో 22 మున్సిపాలిటీలు ఉన్నాయి. కానీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎలాంటి చర్చ పెట్టకుండా అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారు. 'హడావుడిగా ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఎవరితో చర్చించారు? అంతా తన నియంత్రణలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారా? అందుకే కేంద్రీకృత వ్యవస్థను ప్రవేశపెడుతున్నారా? ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలు అనేకం వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి సాధిస్తే.. ఏకఛత్రం కింద పరిపాలన విజయవంతమవుతుందా? అనాలోచిత, అసమర్థ నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్ఠ ఏమైపోతుంది?' అని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వేస్తున్న ప్రశ్నలు కొట్టివేయదగినవేమీ కావు.

ఆర్డినెన్స్‌తో మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు ఇకపై హైదరాబాదీలతో సమానంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అక్కడ మౌలిక వసతులు నగర స్థాయిలో అభివృద్ధి కాలేదు. ఇప్పటివరకు గ్రామాలకు అందుతున్న నిధుల ద్వారా సర్పంచ్‌లు పనులు చేపట్టారు. ఇకపై ఎలాంటి పనులు జరగాలన్నా జీహెచ్ఎంసీని సంప్రదించాల్సి ఉంటుంది. ఇందుకోసం అనేక మందిని కలవాల్సి ఉంటుంది. ఏ ఒక్క చిన్న పని కావాలన్నా ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి, ఎంతో సమయం వెచ్చించాల్సి రావచ్చు. గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుంది. వాటి ఉనికి దెబ్బతింటుంది. వచ్చే జనవరి నాటికి మున్సిపల్ చైర్మన్ల పదవీకాలం ముగియనున్నది. ఆ తర్వాత వచ్చే ఏడాది గ్రేటర్‌లోని కార్పొరేటర్ల పదవీ కాలం తీరనున్నది. సకాలంలో ఎన్నికలు నిర్వహించిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదు. కాబట్టి మున్సిపాలిటీలు, గ్రేటర్‌ను సీఎం తన ఆధీనంలోకి తీసుకొని పాలన సాగించవచ్చు. ప్రజాపాలనలో అన్ని అధికారాలు ఒక వ్యక్తి లేదా పార్టీ చేతుల్లో ఉండటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే. ఇది ప్రజల హక్కులను తుంగలో తొక్కినట్టవుతుంది.

ప్రజాప్రతినిధుల సూచన లేకుండా, ప్రజలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకొని ఆర్డినెన్స్ ద్వారా పాలన చేయడం ప్రజా స్వాతంత్ర్యాన్ని కించపరచడమే. ప్రజలను దృష్టిలోకి తీసుకోకుండా, వారిపై నిర్ణయాలను రుద్దడం ప్రజాపాలన కానేకాదు. అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రణాళిక లేకుండా వాటిని అమలు చేయడం ప్రజాపాలనలో సరిదిద్దుకోలేని తప్పిదాలుగా మారుతాయి.

---



# కాంగ్రెస్ ఆనవాళ్లే కనుమరుగు!



చిటుకుల మైసారెడ్డి
94905 24724

**రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకుల వికృత చేష్టలు పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నది. నిలదీస్తే నిర్బంధిస్తున్నది. ప్రజాపాలన అంటే ఇదేనా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**

ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ గప్పాలు కొడుతున్న కాంగ్రెస్ సర్కార్ పౌర సమాజంపై ఉక్కుపాదం మోపుతున్నది. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, హక్కులను కాలరాస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కార్‌పై విషప్రచారం చేసి, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటినుంచీ ప్రజా గొంతుకలను అణచివేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. బహుజన, దళిత, గిరిజన నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యంలో అఘాయిత్యాలు, దోపిడీలు, హత్యలు షరామామూలైపోయాయి. ప్రశ్నిస్తే చాలు పాలకులు ఉలిక్కిపడుతున్నారు. గొంతెత్తితే చాలు భయపడిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

కాంగ్రెస్ సర్కార్ కొలువై తొమ్మిది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేరలేదు. హామీల అమలు కోసం నినదిస్తున్నవారిపై హస్తం ప్రభుత్వం కక్ష గడుతున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు శాంతియుతంగా నిరసన తెలిపినా ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నది. నిజానిజాలను ప్రజలకు తెలియజేస్తున్న మీడియాపై చిందులు వేస్తున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి, ఖమ్మంలో బీఆర్ఎస్ నాయకులపై రాళ్ల దాడి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై హత్యాయత్నం.. ఇవన్నీ అందులో భాగమే.

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ సర్కార్ పాలనలో పదేండ్ల పాటు రాష్ట్రంలో ఎలాంటి అలజడి, ఆందోళనలు కనిపించలేదు. స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన కేసీఆర్.. ఆ తర్వాత తెలంగాణ పునర్నిర్మాణం కోసమూ అంతే కృషిచేశారు. అందుకే అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోయిన తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. అన్నింటికీ మించి తెలంగాణలో స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సోదరభావం వెల్లివిరిశాయి.

**దేశానికే ఆదర్శంగా నిలిచిన మన తెలంగాణ ఇప్పుడు అతితక్కువ కాలంలోనే సమస్యల నిలయంగా మారిపోయింది. గురుకులాల విద్యార్థులు, రైతాంగం, ఉద్యోగులు, ఆటో కార్మికులు.. ఇలా అన్ని రంగాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కోతలు, కొర్రీలతో అరకొరగా రుణమాఫీ చేయడంతో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది. వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా ఇంకా అందలేదు. పింఛన్ల పెంపు సంగతి పక్కనపెడితే అసలు పింఛన్లే సమయానికి అందడం లేదు. కేసీఆర్ కిట్‌కు కటకట ఏర్పడింది. ఇలా నమ్మి ఓట్లేసిన అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ నట్టేట ముంచుతున్నది.**

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్న ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు తెగపడుతూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నది. అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై తెగబడిన తీరు విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ నడిబొడ్డున పట్టపగలే ఒక ఎమ్మెల్యేపై దాడికి పాల్పడ్డారంటే వారి వెనుక ఎవరి ప్రోద్బలం ఉన్నదో అర్థమవుతున్నది. ఇటువంటి ఘటనలను ఖండించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి దాడిని సమర్థించే ప్రయత్నం చేయడం గర్హనీయం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పేదొకటైతే.. ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి చేసేదొకటి. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని నీతులు చెప్పే రాహుల్‌గాంధీ తెలంగాణలో జరుగుతున్న దమనకాండపై స్పందించకపోవడం శోచనీయం.

ఇలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడితే పోయేది కాంగ్రెస్ పరువే. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తే ప్రజలే కాంగ్రెస్ గొంతు నొక్కుతారు. ప్రజా పోరాటాన్ని అణచివేయాలని చూస్తే ప్రజలే మిమ్మల్ని అణగదొక్కుతారు. తెలంగాణతో గోక్కున్నోడికి పుట్టగతులుండవు. 'పునాదులను పెకిలిస్తా, చరిత్రను మలినం చేస్తా, ఆనవాళ్లు లేకుండా చేస్తా' అంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు. కాంగ్రెస్ ఆనవాళ్లే లేకుండా చేస్తది. తెలంగాణ పౌరుషం ఆ పార్టీ నషాళానికి అంటుకుంటుంది. భయపడే తెలంగాణ కాదిది. ఈ నేపథ్యంలో తెలంగాణను ధ్వంసం చేస్తూ, తెలంగాణ అస్తిత్వం దెబ్బతినేలా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి తీరును అందరూ ముక్తకంఠంతో ఖండించాలి.